

క్యాంపస్ హాస్టళ్లలో..
తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వీసీ టి యాదగిరిరావు తెలిపారు.
- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /16.1

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జనవరి 2 నుంచి వెబ్ ఆప్షన్‌లు

నిజామాబాద్ అర్బన్: డీఈఈసెట్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పరీక్ష రాసిన అభ్యర్థులు జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు ఆప్షన్‌లు ఇచ్చేందుకు అవకాశం కల్పించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. గతంలో ఆప్షన్‌లు తీసుకోని వారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 9 నుంచి 13వ తేదీ వరకు వెబ్‌సైట్ నుంచి అలాట్‌మెంట్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, అనంతరం సీటు పొందిన కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో అడ్మిషన్ పొందాలని సూచించారు.

రాత పరీక్ష తేదీలు ఖరారు



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకోసం అభ్యర్థులకు రాత పరీక్ష తేదీలు ఖరారైనట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టుకు జనవరి 19న ఉదయం 9 నుంచి 9:40 గంటల వరకు పరీక్ష ఉంటుందని, స్కిల్ టెస్ట్ జనవరి 22న ఉదయం 9:05 గంటలకు ఉంటుందని తెలిపారు. రికార్డ్ అసిస్టెంట్ పోస్టు అభ్యర్థులకు జనవరి 19న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఆపరేషన్ స్మైల్ ప్రారంభం



ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డీసీపీ బస్వారెడ్డి సోమవారం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌ల పరిధిలో 18 ఏళ్ల లోపు తప్పిపోయిన బాలురు, బాలికలు ఉంటే సమాచారం సేకరించి వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. బాలకార్మికులను, భిక్షాటనలో ఉన్న పిల్లలను, వదిలివేయబడిన పిల్లలను గుర్తించాలని, పిల్లలతో బలవంతంగా భిక్షాటన చేయించిన, వెట్టిచాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ఇందుకో కోసం జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాల కార్మికులు ఎక్కడైనా ఉంటే డయల్ 100, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ 87126 59777, ఇన్‌చార్జి మహిళా ఆర్ఎస్సై 87125 78197, ఆర్మూర్ ఇన్‌చార్జి ఎస్సై 94401 40022, బోధన్ ఇన్‌చార్జి ఎస్సై 87126 59876 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అర్ధరాత్రి తరువాత బయటికొస్తే కేసులు

- నగరంలో 20 బృందాలతో వాహనాల తనిఖీ
- డీజేలకు అనుమతి లేదు
- నిర్ణీత సమయం వరకే మద్యం దుకాణాలు
- నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఇన్‌చార్జి సీపీ ఆదేశాలు



ఖలీల్‌వాడి: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బయటికి వచ్చినా, గుంపులుగుంపులుగా తిరిగినా కేసులు నమోదు చేస్తామని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో వైన్ షాపులు, బార్‌లు, కల్లు దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన సమయం వరకే తెరిచి ఉంచాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డీజే, ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడం, పటాకులు కాల్చడం వంటి చర్యలకు పాల్పడొద్దని సూచించారు. నిజామాబాద్ నగరంలో ప్రత్యేకంగా 20 టీములను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడతామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రతి పౌరుడు పోలీసులకు సహకరించాలని కోరారు.

రాజకీయాలు.. అనేక పరిణామాలు

- ఎంపీగా రెండోసారి అర్వింద్ విజయం
- కేబినెట్ బెర్త్ కోసం ఏడాదిగా ఎదురుచూపులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కులాచారి దినేశ్
- పలువురికి నామినేటెడ్ పదవులు
- డీసీసీబీ, డీసీఎంఎస్, ఆర్మూర్ బల్దియాల్లో అవిశ్వాసాలు.. కొత్త చైర్మన్ల ఎన్నిక
- కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలు
- పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

రివైండ్ 2024



నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న అమిత్‌షా, పక్కన ఎంపీ అభ్యర్థి అర్వింద్, నాయకులు



డీఎస్ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మంత్రులు

2024 సంవత్సరం జిల్లా రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసుకుంది. విలక్షణ రాజకీయం, ఉద్దండులైన నాయకులున్న ఇందూరు జిల్లాలో ఈ ఏడాది రాజకీయాలు రసవత్తరంగా సాగాయి. సీనియర్ నాయకుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ధర్మపురి అర్వింద్ రెండోసారి ఎంపీగా విజయం సాధించారు. జిల్లాకు ఆశించిన స్థాయిలో నామినేటెడ్ పదవులు దక్కినప్పటికీ.. కేబినెట్ బెర్త్ కోసం ఎదురుచూపులు తప్పలేదు. సీనియర్ నాయకుడు, రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ధర్మపురి శ్రీనివాస్ ఈ ఏడాది జూన్‌లో కన్నుమూశారు.



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పీఠం

➡ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు జనవరి 17న ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఆ తరువాత సెప్టెంబర్ 6న మహేశ్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఎంపికై అదేనెల 15న బాధ్యతలు తీసుకున్నారు. అక్టోబర్ 4న మహేశ్‌గౌడ్ అభినందన సభను పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించగా, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరయ్యారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజకీయ విలక్షణతకు మారుపేరైన ఇందూరు జిల్లాలో 2024లో అనేక రాజకీయ వ్యవహారాలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది మే నెలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరుపున ఎంపీ ధర్మపురి అర్వింద్ రెండోసారి విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి రెండోస్థానంలో, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మూడోస్థానంలో నిలిచారు. ఎన్నికల ప్రచారానికి బీజేపీ అగ్రనేత అమిత్‌షా మే 5న, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏప్రిల్ 22న, మే 8న, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మే 6న, తమిళిసై సౌందరరాజన్ మే 9న జిల్లాలో పర్యటించారు.

➡ బీజేపీ జిల్లా అధ్యక్షుడి మార్పు జరిగింది. జనవరి 18న కొత్త అధ్యక్షుడిగా కులాచారి దినేశ్ ఎన్నికయ్యారు.

➡ యువజన కాంగ్రెస్ ఎన్నికలు సెప్టెంబర్‌లో జరిగాయి. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా విపుల్‌గౌడ్ గెలుపొందాడు.

➡ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినప్పటికీ జిల్లా నుంచి కేబినెట్ మంత్రి లేరు. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని అంతా భావిస్తున్నప్పటికీ ఇప్పటివరకు నియామకానికి సంబంధించి ప్రకటన రాలేదు. దీంతో కేబినెట్ బెర్త్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

➡ జూన్ 29న జిల్లాకు చెందిన సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. 30న అంత్యక్రియలు నిర్వహించగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు.

➡ మార్చి 15న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన తరువాత డిసెంబర్ 29న కవిత మొదటిసారి జిల్లాకు వచ్చారు.

➡ డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న సాంబారి మోహన్‌పై అవిశ్వాసం పెట్టి దించేశారు. కొత్త చైర్మన్‌గా ఆగస్టు 5న తారాచంద్‌ను ఎన్నుకున్నారు.

➡ ఆర్మూర్ మున్సిపాలిటీలో అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు పండిత్ వినీతను దించేశారు. మార్చి 21న కొత్త చైర్‌పర్సన్‌గా వన్నెల్‌దేవి లావణ్యను ఎన్నుకున్నారు.

➡ జిల్లాలో పలు మండల పరిషత్‌లు, సహకార సంఘాల్లో అవిశ్వాస తీర్మానాలు పెట్టి కొత్త ఎంపీపీలు, చైర్మన్‌లను ఎన్నుకున్నారు.

➡ గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియగా, మండల ప్రజా పరిషత్‌ల కాలపరిమితి జూలై 4న, జిల్లా ప్రజా పరిషత్‌ల కాలపరిమితి జూలై 5న ముగిసింది. వీటికి ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదు.



➡ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్లు మార్చి 21న అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిని దించేశారు. మార్చి 26న నూతన చైర్మన్‌గా కుంట రమేశ్‌రెడ్డిని ఎన్నుకున్నారు.



నగరంలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతున్న కేసీఆర్

➡ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్‌అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజు, తాహెర్‌బిన్ హందాన్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా నామినేటెడ్ పదవులు లభించాయి. నుడా చైర్మన్‌గా కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ చైర్మన్‌గా అంతిరెడ్డి రాజిరెడ్డిలకు నామినేటెడ్ పదవులు దక్కాయి.




నెహ్రూపార్క్‌లో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఎంపీగా గెలుపొందిన తరువాత విక్టరీ సింబల్ చూపుతున్న అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలంటూ ఫోన్లు

- రూ. 25వేలు ఇస్తే జాబ్ గ్యారంటీ అని మోసం



నిజామాబాద్ నాగారం: వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాలంటూ అభ్యర్థులకు ఫోన్లు వెళ్తున్నాయి. స్టాఫ్‌నర్సు ఉద్యోగాల కోసం మెరిట్ జాబితా సిద్ధం చేశామని, రూ.1.40 లక్షలు ఇస్తే ఉద్యోగం గ్యారెంటీ అంటు అభ్యర్థులకు కొందరు ఫోన్ చేస్తున్నారు. అడ్వాన్సుగా రూ.25 వేలు ఫోన్ పే చేస్తే మీకు ఉద్యోగం ఇస్తామని లేకుంటే జాబితాలో మీ పేరు ఉండదని సోమవారం పలువురు అభ్యర్థులకు ఫోన్‌లు వచ్చాయి. వైద్యారోగ్య శాఖలో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం మెరిట్ జాబితాను సిద్ధం చేయడానికి అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఈ సమయంలో అభ్యర్థులకు అశోక్ పేరు మీద ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. 9038108948 నంబర్‌కు ఫోన్ పే చేయాలని చెప్పినట్లు అభ్యర్థులు తెలిపారు. అభ్యర్థుల పేర్లు, ఫోన్ నంబర్‌లు ఇతర వద్దకు ఎలా వెళ్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులను అడిగితే తమకు సంబంధం లేదని, అక్రమాలకు తావు లేకుండా మెరిట్ జాబితా సిద్ధం చేస్తున్నామని చెబుతున్నారు. కాగా ఓ అభ్యర్థి 15 రోజుల కింద ఉద్యోగం వచ్చిందని చెప్పగానే రూ.40 వేలు ఫోన్ పే చేసి మోసపోయింది. కాగా దీనిపై డీఎంహెచ్‌వో రాజశ్రీని వివరణ కోరగా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థులకు ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

ఉనికి కోసమే అసత్యపు మాటలు



మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ : ప్రజాప్రతినిధిగా కల్వకుంట్ల కవితను నిజామాబాద్ ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉనికి కోసమే ఆమె కాంగ్రెస్‌పై అసత్యపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన అని, ఎవరి హయాంలో నేరాలు పెరిగాయో చర్చించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. కేవలం కాంగ్రెస్‌ను విమర్శించేందుకు కవిత నిజామాబాద్‌లో మాట్లాడారని, జిల్లా ప్రజల సమస్యలను కవిత ఎంపీగా, ఎమ్మెల్సీగా పట్టించుకోలేదని, అసలు ప్రజలకు ఆమె అందుబాటులోనే లేరని ఆరోపించారు. తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ఎన్నో హామీలను అమలు చేసిందని పేర్కొన్నారు. విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిందన్నారు. నిజాంషుగర్స్‌ను పునఃప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సంక్రాంతిలోపు రైతుబంధుపై ప్రకటన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా కవిత కాంగ్రెస్ పార్టీ చేసే పనుల్లో భాగస్వామి కావాలని సూచించారు.

రైతులను దగా చేస్తున్నారు

- రైతుబంధు ఇవ్వాలన్న సోయి లేదు
- రుణమాఫీ విషయంలో మోసం చేశారు
- ఏడాదిలో మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మేయర్ నీతుకిరణ్

నిజామాబాద్‌అర్బన్: రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మరోవైపు రైతుభరోసాకు షరతులు విధించే ప్రయత్నం చేస్తూ దగా చేస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 3 లక్షల 79వేల మంది రైతులకు రుణమాఫీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 2 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేసిందన్నారు. నిజామాబాద్‌లో ఇంకా లక్షా 2 వేల మందికి, కామారెడ్డిలో 75 వేల మందికి రుణమాఫీ కాలేదని, రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ యూనివర్సిటీకి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణపై కమిటీలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న పిచ్చి ప్రయత్నంతో ఎస్సారెస్పీని ఎండబెట్టారని ధ్వజమెత్తారు.

జిల్లాకు మంత్రి లేడు.. ఎంపీ ఉన్నా లేనట్లే..

కాంగ్రెస్ పాలనలో నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి మంత్రి లేరని, ఎంపీ ఉన్నా లేనట్లేనని, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదని అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఆయేషా, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నగర మేయర్ నీతు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపైకి బుల్డోజర్లు తీసుకెళ్తే ఊరుకోబోం

హైదరాబాద్‌లో హైడ్రా మాదిరి నిజామాబాద్‌లో నిడ్రా అమలు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం దారుణమని, బుల్డోజర్లను ప్రజల ఇళ్లపైకి తీసుకెళ్తే ఊరుకోబోమని కవిత స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఆరు నెలలుగా జిల్లాకు పోలీస్‌కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, జాతీయ నాయకుడని చెప్పుకునే షబ్బీర్ అలీ కనీసం పోలీస్ కమిషనర్‌ను నియమించకపోవడాన్ని ప్రజల గమనించాలని సూచించారు. షబ్బీర్ అలీకి నిజామాబాద్‌పై ఆలోచన, పట్టింపులేదని, జిల్లాలో ఇష్టానుసారంగా ఇసుక దందా సాగుతోందని ఆరోపించారు. మైనింగ్ శాఖ ఆదాయం తగ్గి కాంగ్రెస్ నాయకుల ఆదాయం పెరిగిందన్నారు. ఇసుక దోపిడీని తాము అడ్డుకుంటామని అన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

- పట్టభద్రులు 3,41,313
- ఉపాధ్యాయులు 25,921

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సి సుదర్శన్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యాక జాబితా విడుదల చేసినట్లు ప్రకటించారు.

■ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 499 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది నమోదు కాగా ఇందులో పురుషులు 2,18,060 మంది, మహిళా ఓటర్లు 1,23,250 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. ఇందులో తుది జాబితా విడుదల సమయానికి 26,782 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 16,507 మంది, మహిళలు 10,273 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు.

■ మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు మొత్తం 274 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది నమోదు కాగా, ఇందులో పురుషులు 16,364 మంది, మహిళలు 9,557 మంది ఉన్నారు. ఇందులో తుది జాబితా విడుదల సమయానికి 2,319 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 1,258 మంది, మహిళలు 1,061 మంది ఉన్నారు.

క్లుప్తంగా

'బాన్సువాడపై కేసీఆర్‌తో చర్చిస్తా'



బాన్సువాడ : బాన్సువాడలో బీఆర్‌ఎస్ నాయకత్వం విషయమై పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చిస్తానని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణలో ఏ నాయకుడికి ఇవ్వని ప్రాధాన్యత, గౌరవం పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు బాన్సువాడకే ఎక్కువ మంజూరు చేశారని గుర్తు చేశారు. కానీ కష్టకాలంలో ఉమ్మడి జిల్లాలో పార్టీని కాపాడతారని అనుకుంటే ఆయన మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. త్వరలో బాన్సువాడకు వస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరికీ భయపడవద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో బాన్సువాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ జుబేర్, నాయకులు గణేశ్, సాయిబాబా, రమేశ్ యాదవ్, మహేశ్, శివ, సాయిలు, సద్దాం, చందు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని నీలకంఠేశ్వర్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుమనరెడ్డి, మాజీ కార్పొరేటర్లు విశాలినిరెడ్డి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 105 వినతులు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాసరావు, ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

కల్లు విక్రయించే వారిపై చర్యలు తీసుకోండి

మోస్రాలో కొందరు అనధికారికంగా కల్లు విక్రయిస్తున్నారని, లైసెన్సు లేకున్నా ఇంటింటికి వెళ్లి కల్లు అమ్ముతున్నారని గ్రామానికి చెందిన గౌడ కులస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలపై ఫిర్యాదు

నగరంలోని శ్రీ చైతన్య పాఠశాలపై తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండో శనివారం, ఆదివారం సహా ఇతర అన్ని సెలవుల్లో పాఠశాల బోధన కొనసాగిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదివరకే డీఈవో, మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భూమి కబ్జా చేశారు

మాక్లూర్ మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన పెద్ద మల్లయ్య తన భూమిని కబ్జా చేశారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తన స్థలంలో ఇల్లు, ప్రహరీ నిర్మిస్తున్నారని గ్రామానికి సంబంధించిన రోడ్డు కూడా ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం అఖిలపక్ష గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్లను అర్హులకు కేటాయించాలని కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు

క్యాంపస్ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం

- తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వీసీ టి యాదగిరిరావు తెలిపారు. సోమవారం సాయంత్రం రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి ఆయన క్యాంపస్ హాస్టళ్లను పరిశీలించారు. హాస్టల్ మెస్ కమిటీతోపాటు విద్యార్థులతో మాట్లాడి వసతులు, సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్స్‌తో పాటు వర్సిటీలోని వివిధ కళాశాలల భవనాల్లో 24 గంటల పాటు వైఫై సౌకర్యాన్ని తక్షణమే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిపోయిన కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రికల్ పనులను త్వరలో పూర్తి చేయిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. విద్యార్థుల వినతి మేరకు హాస్టల్ రెన్యువల్ డిపాజిట్ రుసుము రూ.3వేల నుంచి రూ.2వేలకు తగ్గిస్తామన్నారు. వర్సిటీ ఇంజినీర్ వినోద్, చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి

విద్యార్థులను చైతన్యం చేయండి

నిజామాబాద్ అర్బన్: జూనియర్ కళాశాల స్థాయిలోనే విద్యార్థులను చదువుతో పాటు, క్రమశిక్షణ, యాంటీ డ్రగ్స్‌పై చైతన్యవంతం చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అధ్యక్షతన ప్రిన్సిపాల్స్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ కాలేజీల్లో ఇంటర్ బోర్డు సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

స్థానిక ఎన్నికల్లో జయకేతనం ఎగురవేస్తాం

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆ పార్టీ అధినేత కేఏ పాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని బైపాస్ రోడ్డులో గల ప్రైవేట్ హోటల్‌లో మాజీ సర్పంచులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన జోలికి వచ్చిన వారు గతంలో జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో మట్టి కరుచుకు పోయారన్నారు. ప్రజల బాగుకోసం నిత్యం కృషి చేస్తున్న ప్రజాశాంతి పార్టీని స్థానిక ఎన్నికల్లో దీవించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటి వరకు నాయకులు, మంత్రుల మధ్య సమన్వయం లేదని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని మరిచి, పదవుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ మద్దతుతో పోటీ చేసే వారి కోసం అవసరమైతే తాను ప్రచారం చేస్తానన్నారు.



మాట్లాడుతున్న కేఏ పాల్

రిసెప్షనిస్టే డాక్టర్!

- న్యూరో ఫిజిషియన్ పరీక్షించకుండానే రక్తపరీక్షలు చేసుకోవాలని సూచన
- విజయ ఆస్పత్రి ఎదుట రోగుల నిరసన

నిజామాబాద్ నాగారం: రిసెప్షనిస్టే డాక్టర్‌లా రోగులకు రక్త పరీక్షలు చేసుకోవాలని చెప్పిన ఘటన నగరంలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాలు.. నవీపేట్ మండలం నాళేశ్వర్‌కు చెందిన లక్ష్మి నరాల నొప్పితో న్యూరోఫిజీషియన్ విష్ణువర్ధన్ వద్దకు ట్రీట్‌మెంట్ కోసం వచ్చింది. లక్ష్మి వద్ద డాక్టర్ కన్సల్టెషన్ ఫీజు రూ.400 వసూలు చేశారు. డాక్టర్ విష్ణువర్ధన్‌ను కలవకముందే ప్రిస్క్రిప్షన్‌పై పలానా టెస్టులు చేయించుకోవాలని రిసెప్షనిస్టు రాయడంతో ఆమె షాకయ్యారు. డాక్టర్ చూడకుండానే టెస్టులు ఎందుకు చేయించుకోవాలని ఆమె ప్రశ్నించింది. దీంతో సిబ్బంది లక్ష్మిని, ఆమెతో వచ్చిన యువకుడిని బయటకు గెంటేసే ప్రయత్నం చేశారు. ఈ విషయంపై డాక్టర్ విష్ణువర్ధన్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన లేరని బాధితులు ఆరోపించారు. న్యాయవాది పిల్లి శ్రీకాంత్, రెంజల్ బుజ్జి అక్కడకు చేరుకుని డాక్టర్‌ను నిలదీశారు. అనంతరం బాధితులు ఆస్పత్రిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు.



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఆఫీసర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం

- కార్యదర్శిగా గెలుపొందిన స్వామిదాస్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి చిలివేరి సత్యనారాయణ వార్షిక ఆర్థిక నివేదికను చదివి వినిపించారు. క్లబ్ సభ్యులు వార్షిక నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రస్తుత క్లబ్ ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా క్లబ్ అభివృద్ధికి కృషి చేశామన్నారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన సర్వసభ్య సమావేశం రెండు గంటల పాటు కొనసాగింది. అనంతరం కార్యదర్శి పదవికి అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగి, ఫలితాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి పి కిరణ్ కుమార్ గౌడ్, అసిస్టెంట్ ఎన్నికల్లో అధికారులు ఎర్రం విగ్నేష్, ఉదయ కృష్ణ, బంటు వసంత్, దొన్‌పాల్ సురేష్ ఫలితాలను ప్రకటించారు. కార్యదర్శి పదవికి పోటీ పడిన స్వామిదాస్ 107 సాధించి గెలుపొందారు.

క్లబ్ ఆఫీస్ బేరర్స్

ఆఫీసర్స్ క్లబ్ బైలా ప్రకారం కలెక్టర్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ కొనసాగుతారు. మరొక ఉపాధ్యక్ష పదవి ఉండగా 2025 సంవత్సరానికి తాహెర్ బిన్ హందాన్, సంయుక్త కార్యదర్శిగా డాకం సాయిలు, కోశాధికారిగా కె శరత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. కార్యదర్శిగా స్వామిదాస్ గెలుపొందడంతో క్లబ్ పూర్తి స్థాయి కార్యవర్గం కొలువు దీరనుంది.

లా విభాగంలో ఇద్దరికి డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ విభాగం పరిశోధక విద్యార్థులు సభావత్ శ్రీనివాస్, రతన్ సింగ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ప్రసన్నరాణి పర్యవేక్షణలో 'భారతదేశంలోని మహిళలకు నివాస స్థల హక్కులు' అనే అంశంపై శ్రీనివాస్ పరిశోధన పూర్తి చేశాడు. 'అత్యవసరాల పరిస్థితిలో సినిమా నిర్మాణం- సినిమాల హక్కులు' అనే అంశంపై రతన్‌సింగ్ పరిశోధన చేశాడు.



శ్రీనివాస్



రతన్‌సింగ్

ఏపీకే ఫైల్‌తో రూ.1.25 లక్షలు మాయం

కామారెడ్డి రూరల్: ఏపీకే ఫైల్ పంపి అకౌంట్‌లో నుంచి డబ్బులు మాయం చేసిన ఘటన కామారెడ్డిలోని దేవునిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెట్కూరి రవికి రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. మాటల్లో పెట్టి ఏపీకే ఫైల్ పంపాడు. దాన్ని క్లిక్ చేయడంతో ఫోన్ మొత్తం సదరు వ్యక్తి చేతిలోకి వెళ్లిపోయింది. అనంతరం రవి అకౌంట్‌లోని రూ.50 వేలు ఖాళీ చేశాడు. అంతటితో ఆగకుండా రవి పేరిట రూ.75 వేలు లోన్ తీసుకున్నాడు.

పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతమ్ నగర్‌కి చెందిన చంద్రకాంత్ పాత కక్షలతో తునికి యాదగిరిపై కత్తితో దాడి చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. చంద్రకాంత్ ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో యాదగిరి ఆటో టాప్ చింపేసి అతనిపై కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రైం కార్నర్

బాల్కొండలో అగ్ని ప్రమాదం



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని నడిమిగల్లిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన పల్లికొండ చిన్న నర్సయ్య ఇంట్లో ఉదయం దేవుడి ఫొటోల వద్ద దీపం వెలిగించారు. అనంతరం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. దీపంతో పెంకుటిల్లు కట్టెలకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో మంటలు అదుపు చేశారు. అప్పటికే మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు దగ్ధం



సిరికొండ: మండలంలోని చిన్న వాల్గోట్ గ్రామంలో కారు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చెరుకుపల్లి ఆదర్శ్‌రెడ్డి తన కారును తన ఇంటి ఆవరణలో నిలిపి ఉంచాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం ఏర్పడినపుడు కరెంట్ మీటర్ వద్ద మంటలు చెలరేగి కారుపై పడ్డాయని బాధితుడు తెలిపారు. కారుకు అంటుకున్న మంటలు ఇంటి తలుపులు, కిటికీలకు వ్యాపించాయి. స్థానికులు మంటలను ఆర్పి వేశారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్ కేసులో జడ్జి ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సోమవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. అందులో వల్లపు శ్రీనివాస్‌కు ఒకరోజు, నాగులపల్లి శంకర్‌కు రెండు రోజుల జైలు శిక్షను జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జన్ విధించారని పేర్కొన్నారు. 25 మందికి జరిమానా విధించినట్లు చెప్పారు.

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి..

నిజామాబాద్ రూరల్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. ఈ నెల 28న తనిఖీలు నిర్వహించగా ఆర్మూర్‌కు చెందిన కిరణ్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికాడన్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా రెండు రోజుల జైలు శిక్ష వేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రికార్డు అసిస్టెంట్ మృతి



మాచారెడ్డి: మాచారెడ్డి తహశీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాయినీ నవీన్(32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన నవీన్ కొంతకాలంగా రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి కామారెడ్డి వైపు నుంచి మాచారెడ్డి వస్తుండగా పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్, అంబం గ్రామ శివారులోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీ చేశారు. దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. సంబంధిత రైతులు ఎడపల్లి ఎస్సై వంశీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సంవత్సరంలో మండలంలో సుమారు 40 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయ్యాయి. వరినాట్ల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఖలీల్‌వాడి: నిర్మల్ జిల్లాకు చెందిన వాగేవార్ గౌతమ్(27)పై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 17న భర్తతో గొడవపడి నిర్మల్‌కు వచ్చిన ఓ మహిళను సాయం చేస్తానని నమ్మించి గౌతమ్ నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఓ లాడ్జిలో ఆమెకు ఇష్టం లేకుండా శారీరకంగా వాడుకొని, నిర్మల్‌లో వదిలేశాడు. స్పృహ తప్పి పడి ఉన్న ఆమెను గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

రెచ్చిపోయిన దొంగలు

- నందిపేట్‌లో ఐదు ఇళ్లలో చోరీ
- బాల్కొండలో రెండు తులాల బంగారం అపహరణ

నందిపేట్: నందిపేట్‌లోని రామ్‌నగర్ కాలనీలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఐదు ఇళ్లలోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు.. కాలనీలోని జూడా చర్చ్ సమీపంలో గల ఇసుక కొండయ్య, మేక వెంకటేశ్, పేదూరి భూమేశ్వర్, వీఆర్వో రాజేశ్వర్, బైండ్ల నారాయణ కుటుంబ సభ్యులు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు వారి ఇళ్లలోకి చొరబడ్డారు. ఇసుక కొండయ్య ఇంట్లో 3 తులాల బంగారం, రూ.6 వేల నగదు పోయింది. మిగతా నాలుగు ఇళ్లలో ఏమీ దొరకకపోవడంతో వస్తువులను చిందరవందరగా పడవేసి వెళ్లిపోయారు. దొంగల కదలికలు సీసీ ఫుటేజీల్లో నమోదయ్యాయి. ఒకే సమయంలో రెండు బ్యాచ్‌లుగా దొంగతనం చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం సభ్యులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం అర్ధరాత్రి కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు బాదారని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పామన్నారు.



నందిపేట్‌లో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగలు రెండు తులాల బంగారం, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన పాగిరి చిన్న మల్లేశ్ బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లాడు. భార్య సవిత పిల్లలతో కలిసి ఇంట్లో ఉంటుంది. ఆమె రెండు రోజుల క్రితం ముప్కాల్‌లోని తన పుట్టింటికి వెళ్లింది. తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం చోరీ చేశారు. బాల్కొండ ఎస్సై నరేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా



బోల్తా పడిన ఆటో



మినీ వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

- సడెన్ బ్రేక్ వేసిన లారీ డ్రైవర్
- ఒకదానికి ఒకటి ఢీకొన్న ఐదు వాహనాలు

ఆర్మూర్‌టౌన్: ముందు వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో లారీ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా వెనకాల వస్తున్న వాహనాలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళా ప్రాంగణం సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. నిర్మల్ వైపు నుంచి ఆర్మూర్ వస్తున్న ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వెనుక వస్తున్న లారీ డ్రైవర్ ఆటోను ఢీకొట్టకుండా ఒక్కసారి బ్రేక్ వేయడంతో వెనుకలే ఉన్న టాటా ఏస్, రెండు కార్లు, వ్యాన్ ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనాలు ఢీకొనడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రి హత్య

రుద్రూర్: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని ఓ కుమారుడు తన తండ్రిని హత్య చేశాడు. ఈ ఘటన రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ హైమద్(65)కు కుమారుడు మహబూబ్ అలియాస్ బబ్లూ ఉన్నాడు. హైమద్ భార్య ఇటీవల మృతి చెందడంతో ఇంట్లో తండ్రి కొడుకులే ఉండేవారు. మద్యానికి బానిసైన మహబుబ్ తాగడానికి డబ్బులు కావాలని తరుచు హైమద్‌తో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి డబ్బుల విషయమై ఘర్షణ జరిగింది. స్థానికులు జోక్యం చేసుకుని ఇద్దరికి సర్ది చెప్పారు. అర్ధరాత్రి మళ్లీ మహబూబ్ తండ్రితో గొడవ పడి ముఖం, ఛాతీపై కొట్టాడు. దీంతో హైమద్ మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రుద్రూర్ సీఐ కృష్ణ కుమార్, ఎస్సై సాయన్న వివరాలు సేకరించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

రాజంపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొమ్ము నర్సింలు(37) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అప్పుల బాధతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సుమలత ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

జీవితంపై విరక్తితో..

బాన్సువాడ: బాన్సువాడకు చెందిన పురుషోత్తం (40) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిగా భార్య వేరుగా ఉండటంతో ఆత్మచేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



పురుషోత్తం(ఫైల్)

మనస్తాపంతో మరొకరు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోకల్ వెల్మల్ గ్రామానికి చెందిన సుంకరి పోశెట్టి(43) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాలు.. పాత సామాను ఏరుకొని జీవనం సాగించే పోశెట్టి భార్య నాలుగేళ్ల క్రితం చనిపోయింది. దీంతో బాల్కొండకు చెందిన నక్క పోసానితో సహజీవనం చేస్తున్నాడు. ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పోసాని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన పోశెట్టి దులానికి ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురు ఎర్రొల్ల సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

- ఒకరిని కాపాడబోయి మిగతావారు మరణించి ఉండొచ్చు
- ఎస్సై, కానిస్టేబుల్, ఆపరేటర్‌ల మృతి కేసుపై ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: సంచలనం సృష్టించిన ముగ్గురి మృతి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పీఎస్ కానిస్టేబుల్ శ్రుతి, సహకార బ్యాంకు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌ల మృతి కేసుపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. ముందుగా దూకిన ఒకరిని కాపాడబోయే ప్రయత్నంలో మిగతా ఇద్దరు కూడా నీట మునిగి చనిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు.

ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి అంటూ ఎవరూ లేకపోవడంతో సంఘటన జరిగిన సమయంలో అక్కడ ఏం జరిగింది అనే దానిపై స్పష్టత రాలేదన్నారు. వారు నీట మునిగిన ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉంటుందన్నారు. ఈత రాని వారు అందులో పడితే బయటకు రావడం సాధ్యం కాదన్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా, ఆత్మహత్యలా అనేది తెలియడం లేదన్నారు. మృతుల సెల్‌ఫోన్‌లు, నీటి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామన్నారు. నివేదిక రావాల్సి ఉందని, సాంకేతిక అంశాల ఆధారంగా పరిశోధన చేస్తున్నామని తెలిపారు. మృతిచెందిన ఎస్సై సాయికుమార్‌పై గతంలో ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్ద బజార్‌లో గల ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించినట్లు ఎస్సై యాసీన్ ఆరాఫత్ తెలిపారు. ఏటీఎంను పగులగొట్టడానికి యత్నించగా శబ్దం రావడంతో స్థానికుడు కేకలు వేశాడు. దీంతో దొంగ పరారయ్యాడు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: చోరీ కేసులో నగరంలోని కోటగల్లీకి చెందిన ఎలిగేటి నాగరాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ నెల 28న కోటగల్లీలోని శశిరేఖ ఇంట్లోకి చొరబడి నాగరాజు రూ.10వేలు, సిలిండర్ చోరీ చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని నగదు, సిలిండర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.